'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

భగ్గుమన్న టారిఫ్ యుద్ధం

ఏదైనా దేశాన్ని మరో దేశం నయానా భయానా తన ప్రయోజనాలకు అనుకూలంగా మలచుకోవాలంటే అనేక మార్గాలుంటాయి. అందులో గన్-బోట్ డిప్లమసీ ఒకటి. ముందుగా సైనిక శక్తితో ఒక దేశాన్ని చుట్టుముట్టి నా మాట వింటావా లేదా.. మా సరుకులు కొంటావా లేదా.. అంటూ బెదిరించడం ఈ విధానం ప్రత్యేకత. అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ హయాంలో అప్పటి విదేశాంగమంత్రి హెన్రీ కిసింజర్ దీన్ని బాగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఇప్పుడు ట్రంప్ హయాంలో గన్-బోట్ స్థానంలో టారిఫ్ వచ్చింది. సాధారణంగా ఎగుమతి, దిగుమతి సుంకాలు ప్రతి దేశం విధిస్తుంది. సప్లయ్ డిమాండ్‌ను బట్టి అవి మారుతుంటాయి. కానీ, ట్రంప్ తన మాట జవదాటితే టారిఫ్ అస్త్రం సంధిస్తున్నారు. తాజాగా ఆయన మెక్సికో, కెనడా, చైనా దేశాల ఉత్పత్తులపై భారీ సుంకాలు వేస్తున్నట్టు ప్రకటించారు. కెనడా, మెక్సికోలపై 25 శాతం చొప్పున, చైనాపై అదనంగా మరో 10 శాతం సుంకం వేయనున్నట్టు తెలిపారు. అమెరికా కార్మిక వర్గాన్ని, పరిశ్రమలను కాపాడేందుకు సుంకాలు పెంచుతున్నట్టు వెల్లడించారు. ఊహించినట్టుగానే బాధిత దేశాలు దెబ్బకు దెబ్బ అన్నట్టుగా ఆర్థిక ప్రతీకార చర్యలు చేపట్టాయి. కెనడా, మెక్సికో కొద్దిగా అతలాకుతలం అయినప్పటికీ చైనా మాత్రం ముందు జాగ్రత్తలతో స్థిరంగా నిలబడింది. మూడు దేశాలూ అమెరికా సరుకులపై సుంకాలు పెంచుతున్నట్టు తెలిపాయి.

తన చర్యల వల్ల బాధ కలిగినప్పటికీ దీర్ఘకాలికంగా అవి మేలు చేస్తాయని ట్రంప్ అమెరికా ప్రజలను అనునయించే ప్రయత్నం చేశారు. ఆయా దేశాలు అనుసరించే బేసబబు వాణిజ్య విధానాల వల్ల టారిఫ్ పెంపు అనివార్యమైందనేది ఆయన వాదన. దీర్ఘకాలికం మాటేమో గానీ స్వల్పకాలికంగా స్టాక్ మార్కెట్లపై అవి ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. వాణిజ్య యుద్ధాల వల్ల ప్రపంచ వృద్ధి క్షీణిస్తుందనే భయాల వల్ల మార్కెట్లు కుప్పకూలాయి. అందులో అమెరికా మార్కెట్లూ ఉండటం గమనార్హం. యూరప్, ఆసియా మార్కెట్లు కూడా భారీగా నష్టపోయాయి. ఒక్క రోజులోనే లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.5.30 లక్షల కోట్లు తగ్గిపోయింది. డౌజోన్స్ పారిశ్రామిక సూచీ పతనమైంది. బ్రిక్స్ కూటమి డాలరు చెల్లింపుల వ్యవస్థ నుంచి వైదొలిగితే వంద శాతం టారిఫ్ వేస్తానని ఆయన గత ఎన్నికల ప్రచారంలోనే బెదిరించారు. ఇదే జరిగితే ఇండియాతో పాటు ఇతర సభ్య దేశాలపై అనివార్యంగా ప్రభావం చూపుతుంది.

ఈ వాణిజ్య యుద్ధాల వల్ల అంతిమంగా నష్టపోయేది ప్రజలేననేది నిర్వివాదాంశం. టారిఫ్ పెంపు వార్త ప్రభావంతో క్రూడాయిల్ ధరలు పెరిగాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా అన్ని సరుకుల ధరల పెంపునకు దారితీస్తుందని చెప్పక తప్పదు. సంయమనంతో, చర్చల ద్వారా పరిష్కరించుకోవాల్సిన అంశాలకు అమెరికా అధ్యక్షుడు టారిఫ్ పెంపును ఎంచుకుంటున్నారు. తన అగ్రరాజ్య ప్రాభవానికి ఇతర దేశాలపై ఆధారపడే అమెరికా బెదిరింపులతో, దుస్సాహసిక చర్యలతో సాధించేదేమీ ఉండదు. వాణిజ్యంలో ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. సుంకాల బెదిరింపులు శోభించవు, లాభించవు.

సంవాదంలో మూడవ పక్షం

టంకశాల అశోక్

పరిస్థితులు ఒక్కోసారి అనూహ్యంగా, విచిత్రంగా ఉంటాయి. ఏదైనా విషయమై రెండు పక్షాలు వాద సంవాదాలతో పరస్పరం తలపడినప్పుడు, ఆ రెండు పక్షాలకూ తెలియకుండా మూడవది ఒకటి ముందుకువస్తుంది. ఆ మూడవ పక్షం వాదన ఆసక్తికరంగా మారుతుంది. అటువంటి ఉదంతం ఒకటి జనవరి 31న కనిపించింది. ఆ రోజున మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. అదే రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందుకు ప్రతిగా కేసీఆర్ గురించి, ఆయన పరిపాలన గురించి ఎదురు విమర్శలు చేశారు. ఇదంతా 31వ తేదీ మధ్యాహ్నం జరిగింది.

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 2024-25వ సంవత్సరపు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టింది. ఆ సర్వే తెలంగాణ గురించి ఏమన్నది? లేదా, కేసీఆర్-రేవంత్‌రెడ్డిల సంవాదంలో, ఆ సంవాద అంశాలపై, ఒక మూడవ పక్షంగా ఏమన్నది? ఇది అందరూ తెలుసుకోదగిన ఆసక్తికరమైన విషయం. అందులోకి వెళ్లేముందు మరొక విషయం చెప్పుకోవాలి. ఈ ఇద్దరు నాయకుల సంవాదానికి ముందురోజున అనగా జనవరి 30వ తేదీన, ఆన్‌లైన్ ఫలితం ఒకటి వెలువడింది. అందులోని అంశం ఎవరిపాలన బాగుందని. దానిని నిర్వహించింది స్వయంగా కాంగ్రెస్ పార్టీయే. అందులో పాల్గొన్నది సామాన్య ప్రజలు. ఆ ఫలితాలు ఏమన్నాయి? మూడింట రెండు వంతుల మంది కేసీఆర్ పాలనను, ఒక వంతు మంది రేవంత్ రెడ్డి పాలనను ప్రశంసించారు.

> **ఆన్‌లైన్ పోల్ ఫలితాలు ఇద్దరు నాయకుల ప్రసంగాలలోనూ ప్రస్తావనకు వచ్చాయి. ఆ విధంగా, ఈ సంవాదంలో ఆర్థిక సర్వే వలెనే, ఆన్‌లైన్ పోల్ రూపంలో సామాన్య ప్రజల అభిప్రాయం కూడా మూడవ పక్షమైంది. కాకతాళీయంగా ఆ సర్వే చెప్పింది, ప్రజలు చెప్పింది ఒక్కటే అయింది. అవి రెండూ కేసీఆర్‌తో ఏకీభవించాయి. రేవంత్‌రెడ్డి ఒంటరి అయ్యారు. ఓవరాల్ స్కోర్ 3:1 అనగా, నాలుగింట మూడు వంతులు ఒకవైపు, ఒక వంతు మరొక వైపుగా మారింది.**

కేసీఆర్ ఏమన్నారు, రేవంత్‌రెడ్డి అన్నదేమిటనే వివరాలు పత్రికలలో వచ్చినవే గనుక అదంతా ఇక్కడ మళ్లీ రాయనక్కరలేదు. రెండింటి మధ్య తేడా రేవంత్‌రెడ్డి భాష. ఎవరు చేసిన అభివృద్ధి ఏమిటో, చేయనిదేమిటో ఇరు పక్షాల నుంచి వింటూనే ఉన్నాము. ఆయన భాష కూడా వింటున్నదే గనుక, అది కూడా చెప్పుకోనక్కరలేదు. భాషను అట్లుంచి, అభివృద్ధికి సంబంధించి ఉభయుల వాదనల విషయమై, ఒకవైపు ప్రజలు, మరొకవైపు ఆర్థిక సర్వేతో కూడిన మూడవ పక్షం తీర్పు ఏమిటన్నది ఇక్కడ ప్రధానం. అంతిమంగా ప్రజలకు అవసరమైంది, వారు చూసేది అదే. అట్లాగే, కేంద్ర, ఆర్థిక సర్వే వంటి నివేదికలను రూపొందించే నిపుణులు దృష్టి పెట్టేది కూడా దానిపైనే.

ఆ విధంగా కేసీఆర్-రేవంత్‌రెడ్డి సంవాదంలో ఎవరి మాటలకు గల విలువ ఎంతో ఎవరికి వారు తేల్చుకోవచ్చు. నిజానికి, ప్రస్తుత కేంద్ర ఆర్థిక సర్వే తరహా నివేదికలు గతంలోనూ అనేకం వెలువడ్డాయి. వాటిలో ఇటీవలి రిజర్వ్ బ్యాంక్‌ది ఒకటి. అది కూడా సంవాదంలో మూడవ పక్షం అవుతుంది. ఆర్థిక సర్వేలో, రిజర్వ్ బ్యాంక్ నివేదికలో పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిందేమిటన్న దానిపై ఏమన్నారో ఇప్పుడు స్థూలంగా చూద్దాము.

> **తెలంగాణ కాంగ్రెస్ పార్టీ స్వయంగా నిర్వహించిన ఆన్‌లైన్ పోల్‌లో వ్యక్తమైన ప్రజాభిప్రాయాన్ని. చివరగా, ఉభయ నాయకుల సంవాదాన్ని. దీనంతటిని బట్టి ఎవరి అభిప్రాయానికి వారు రావచ్చు. ఆర్థిక సర్వే, రిజర్వ్ బ్యాంక్‌ల నివేదికల అంశాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన అభిప్రాయాలు చెప్పటం కూడా చాలా అవసరం. ఎందుకంటే, ఇంతవరకు ఈ రెండింటితో పాటు ఎంతో ముఖ్యమైన పలు నివేదికలు వెలువడినా ప్రభుత్వం మౌనం వహించింది తప్ప ఒక్కమాటైనా మాట్లాడలేదు.**

ఎందుకో తెలియదు. పైగా, కేసీఆర్ పాలనలో తెలంగాణ సర్వనాశనమైందని, వందేండ్లు వెనుకకు వెళ్లిందనే మాటలనే ముఖ్యమంత్రి, అందరు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పదే పదే అంటూ వస్తున్నారు. ఇటువంటి ముఖ్యమైన నివేదికలపై నోరు విప్పనప్పుడు ప్రజలు వారి గురించి ఏమనుకోవాలి? తమ విమర్శలకు ప్రజల దృష్టిలో విశ్వసనీయత ఏ విధంగా వస్తుంది?

ఇప్పుడు, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ జనవరి 31న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే అంశాలను చూద్దాము. వాటిని బట్టి, సొంత పన్ను ఆదాయ వసూళ్లలో తెలంగాణ మొత్తం దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. సాగు జలాల విషయంలో పంజాబ్, హర్యానా తర్వాత మూడవ స్థానానికి ఎదిగింది. ప్రతి ఇంటికి శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్న రాష్ట్రాలలో ఒకటిగా మారింది. రియల్ ఎస్టేట్, సేవారంగాల్లో అగ్రగామిగా నిలిచింది. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే వీ హబ్ మొత్తం దేశంలోనే అసమానమైనదని పేర్కొన్నది. ఏడు వారాల క్రితం డిసెంబర్‌లో విడుదలైన రిజర్వ్ బ్యాంక్ వారి 'హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్-2024' అయితే, కేసీఆర్ పాలనలో తెలంగాణ అభివృద్ధిపై ఇంకా అనేక గణాంకాలను పేర్కొన్నది.

వాటి ప్రకారం తలసరి ఆదాయం 2014-15లో ఉండిన రూ.1,03,889 నుంచి 2023-24 నాటికి రూ.3,56,564కు పెరిగి మొత్తం దేశంలోనే మొదటి స్థానానికి చేరింది. ఇది 243 శాతం పెరుగుదల. ఇదే కాలంలో జీఎస్‌డీపీ, లేదా రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.4.3 లక్షల కోట్ల నుంచి రూ.15.01 లక్షల కోట్లకు పెరిగింది. ఇది 249 శాతం పెరుగుదల. తలసరి విద్యుత్తు వినియోగం 108 శాతం పెరిగి 1,151 యూనిట్ల నుంచి 2,398 యూనిట్లకు చేరింది. సాగునీటి సదుపాయం 105 శాతం విస్తరించి 78.18 లక్షల ఎకరాలకు బదులు 160 లక్షల ఎకరాలైంది. స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 106 శాతం ధాన్యం ఉత్పత్తి 119 శాతం, వైద్యంపై ప్రభుత్వ వ్యయం 175.5 శాతం, సాగు విస్తీర్ణం 47.74 శాతం, మూలధన వ్యయం 578 శాతం, రహదారుల నిడివి 52.42 శాతం పెరిగాయి.

నిరుద్యోగం పట్టణ ప్రాంతాలలో 28.76 శాతం, గ్రామీణ ప్రాంతాలలో 85.7 శాతం తగ్గింది. శిశు మరణాలు 66.6 శాతం తగ్గాయి. పోషకాహారానికి మాంసాహారం ఒక సూచిక అనుకుంటే, ఆ ఉత్పత్తి వంద శాతం పెరిగి, తెలంగాణ మొత్తం దేశంలోనే ప్రథమ స్థానానికి చేరింది.

> **తెలంగాణ అప్పులు రూ.7 లక్షల కోట్లకు పైగానన్నది ప్రచారం కాగా, అది ఎంతమాత్రం నిజం కాదని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేస్తూ, ఆ మొత్తం రూ.3 లక్షల కోట్ల 89 వేలు మాత్రమేనన్నది. ఈ లెక్కలన్నీ ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ పెద్దలు, వారి ప్రియమిత్రులైన మేధావి గణాలు చూసి ఉంటారా? లేక దివాంధులుగా మారి ఉంటారా? వీరెవ్వరి నుంచి చదీచప్పుడు మాత్రం వినరాలేదు.**

వినరాకపోగా, అవే ప్రచారాలు, సవాళ్లు, ఈ కాంగ్రెస్ ఆన్‌లైన్ పోల్ సందర్భంగా జనవరి 31వ తేదీన సైతం సాగించారు. అడాల్ఫ్ హిట్లర్, ఆయన ప్రచారమంత్రి జోసెఫ్ గోబెల్స్ జీవించి లేరు గాని, ఉండి ఉంటే ఈ మంత్రులు, నాయకులు, మేధావులను తమ సలహా మండలిగా నియమించుకునేవారు. అసత్య ప్రచార విద్యలో నిష్ణాతులైన ఆ ఇద్దరు జర్మన్ నేతలకు వీరు అనేక మెళకువలు నేర్పగలిగేవారు.

ఇంతకూ జనవరి చివరి రోజుల నాటి సర్వే అధికార పక్షం స్వయంగా నిర్వహించుకున్నదే. రాష్ట్రాన్ని తాము అభివృద్ధి రీత్యా, సంక్షేమం రీత్యా అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని, ఎన్నికల సమయంలో బాండ్ పేపర్లపై ఇంటింటికీ తిరిగి పంచిన గ్యారెంటీ హామీలు అన్నింటికి అన్నింటినీ అమలుచేసి వేశామని చెప్పుకొంటూ, పంచాయతీ ఎన్నికలపై గురిపెట్టి జరుపుకొన్న సర్వే అది. దానిలో వచ్చిన ఫలితమేమిటో పైన చూశాం. కేసీఆర్, రేవంత్ సంవాద పరంపరలు ఉండగా, ఇప్పుడు సామాన్య ప్రజలు అనే మరొక మూడవ పక్షపు తీర్పు ఈ తీరుగా ఉన్నది. వీటిపై ఇద్దరు నాయకుల సంవాదాన్ని జనవరి 31వ తేదీన చూశాము కానీ, అది గమనించి మూడవ పక్షంలో ఎవరూ కొత్తగా ఆశ్చర్యపోయి ఉండరు. ఇద్దరూ ఎవరి స్వభావానికి తగినట్లు వారు మాట్లాడారు గనుక. ■

> **కేసీఆర్, రేవంత్ సంవాద పరంపరలు ఉండగా, ఇప్పుడు సామాన్య ప్రజలు అనే మరొక మూడవ పక్షపు తీర్పు ఈ తీరుగా ఉన్నది. వీటిపై ఇద్దరు నాయకుల సంవాదాన్ని జనవరి 31వ తేదీన చూశాము కానీ, అది గమనించి మూడవ పక్షంలో ఎవరూ కొత్తగా ఆశ్చర్యపోయి ఉండరు. ఇద్దరూ ఎవరి స్వభావానికి తగినట్లు వారు మాట్లాడారు గనుక.**

తెలంగాణను పడగొట్టకుంటే చాలు!

డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్

2023, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన వెంటనే.. హస్తం పాలకులు గెలిచి, నిలిచి తెలంగాణను గెలిపించాలని స్వరాష్ట్ర కీర్తిని శిఖరం అంత ఎత్తున నిలబెట్టాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షించారు. అందుకే, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఆయనకు శుభం కలగాలని దీవెనార్థులిచ్చారు. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం కేసీఆర్‌పై చిల్లర మల్లర వ్యాఖ్యలు చేస్తూ తన కురచబుద్ధిని ఎప్పటికప్పుడు బయటపెట్టుకుంటున్నారు.

ప్రభుత్వాలు మారినా తెలంగాణ అభివృద్ధి చెందాలనేది కేసీఆర్ ఆశయం. అందుకే, అధికారం కోల్పోయాక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా ఒక్కరే ప్రగతి భవన్‌ను వీడారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరేందుకు మార్గం సుగమం చేసి సహకరించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తొలిసారి అధికారంలోకి వచ్చాక రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకుండా.. సొంత పార్టీ నేతలే పొగ పెట్టాలని చూశారు. రేవంత్ వ్యతిరేక వర్గీయులు కాలం కలసివస్తే సీఎం పీఠాన్ని హస్తగతం చేసుకోవాలని చూశారు. ఈ నేపథ్యంలో రేవంత్ వ్యతిరేకులను కలుపుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కేసీఆర్‌కు పలువురు సూచించారు. వారి సూచనలను కేసీఆర్ ఏకోన్ముఖంగా కొట్టిపారేశారు. కొన్నిరోజుల తర్వాత, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన తెలంగాణను విజయతీరాలకు చేర్చాలని ఆకాంక్షించారు. ఆయన మొదటిరోజు ఏదైతో చెప్పారో, అలాగే, హుందాగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయన ఆదేశానుసారం పార్టీ శ్రేణులు కూడా అదే బాటలో నడుస్తున్నారు.

> **కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం కోతికి కొబ్బరి చిప్ప దొరికితే ఎలా గంతులేస్తుందో, అలా గంతులేస్తూ అందివచ్చిన అవకాశాన్ని అరికాళ్లతో తన్నేస్తున్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి.. బీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబంపై దుర్భాషలాడటానికే పరిమితమవుతున్నారు. మైక్ కనిపిస్తే చాలు వేదిక, సందర్భంతో సంబంధం లేకుండా బూతు పురాణం మొదలుపెడుతున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాననే సోయి మరిచి వ్యవహరిస్తున్నారు.**

గతంలో కేటీఆర్, హరీశ్‌రావు, కేసీఆర్ మనుమడు హిమాన్షుపై నోరు పారేసుకున్న రేవంత్ రెడ్డి.. తాజాగా మంచీ చెడు మరిచి, కన్ను మిన్ను కానరాక.. 'కట్టె లేకుండా నిలబడు చాలు' అంటూ యావత్ దివ్యాంగ లోకాన్ని అవమానించారు. కట్టె పట్టుకున్న వాళ్లంతా పనికిరానివాళ్లని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఇది ఆయన కురచ బుద్ధికి నిదర్శనం. కట్టె పట్టుకొని చరిత్రకు పట్టిన చెదను దులిపిన ఎందరో కారణజన్ముల గురించి రేవంత్‌కు తెలియకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. కట్టెతోనే జాతిపిత మహాత్మా గాంధీ బ్రిటిషర్లను తరిమి తరిమి కొట్టారు. కట్టెతో జరిగిన కదనాన్ని జయించిన మహాత్ముడి గురించి రియల్ ఎస్టేట్ వ్యాపారి రేవంత్‌కు ఎరుక లేకపోవడం విడ్డూరమేమీ కాదు.

ప్రపంచ యవనికపై తెలంగాణ పరువు తీస్తున్న ఆయనకు.. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కట్టె సాయంతోనే తరిమికొట్టి దక్షిణాఫ్రికాను నిశీధి నుంచి వెలుగులోకి నడిపించిన నల్ల సూరీడు నెల్సన్ మండేలా గురించి తెలుస్తుందనుకోవడం మన తప్పు. కండబలం ఉన్నదని విర్రవీగే రేవంత్‌కు బుద్ధిబలంతో ప్రపంచానికి దారిచూపిన స్టీఫెన్ హ్యాకింగ్ గురించి ఏ మాత్రం తెలియదనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నా వెరవకుండా సంప్రదాయ నృత్యానికే వన్నె తెచ్చిన సుధా చంద్రన్ గురించి రేవంత్ తెలుసుకోవాలి. పోలియోతో కుర్చీకే పరిమితమైనప్పటికీ ప్రముఖ వైద్యుడు సురేష్ హెచ్ అద్వానీ మన దేశంలో మొదటి బోన్ మ్యారో చికిత్సను చేయలేదా? పక్షవాతంతో బాధపడుతున్న అజిత్ జోగి ఛత్తీస్‌గఢ్ సీఎం పీఠాన్ని అధిరోహించలేదా? వీల్‌చైర్‌లోనే ఉంటూ తమిళనాడుకు కరుణానిధి దశ దిశ చూపలేదా? అంతెందుకు రేవంత్‌రెడ్డి మామ జైపాల్‌రెడ్డి గురించి ఆయనకే తెలియకపోవడం బాధాకరం. పోలియో బారినపడిన జైపాల్‌రెడ్డి కట్టె సాయంతోనే పార్లమెంటు బాట పట్టారు.

నాయకత్వం అనేది వ్యక్తిత్వం, వ్యక్తుల ఆలోచనలు, ఆశయాలను బట్టి ఉంటుంది తప్ప, శరీరాకృతిని బట్టి కాదు. నాయకుడికి కండబలం ఉంటేనే సరిపోదు, బుద్ధిబలం కూడా ఉండాలి. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న రేవంత్ ఇలా తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన కేసీఆర్‌ను దూషించడం ఆయనకు ఏ మాత్రం శోభనివ్వదు. భవిష్యత్తులో రేవంత్ రెడ్డి అధికారం కోల్పోయాక ఆయనను కూడా ఇలాగే దుర్భాషలాడితే ఒప్పుకొంటారా? ఆయన అనేది ఆలోచించుకోవాలి. ప్రధాని మోదీని 70 అంగుళాల ఛాతి గల మనిషి అని అందరూ అంటున్నారు. ఈ విషయంలో శారీరకంగా పోలిస్తే మోదీతో రాహుల్ సరితూగగలరా? ఈ విషయం రాహుల్‌కు రేవంత్‌రెడ్డి చెప్పగలరా? ఎన్నికల్లో గెలుపోటములు సహజం. కేసీఆర్‌కు పోరాటం కొత్త కాదు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూశారు. పద్నాలుగేండ్ల ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో పదవులను ఆయన అధిరోహించారు. ఎన్నో పదవులను త్యజించారు కూడా. రాజీనామాను అస్త్రాలుగా సంధించి సమైక్యవాదులను, తెలంగాణ వ్యతిరేకులనెందరినో పడగొట్టారు. తెలంగాణ వాదాన్ని నిత్యం, సజీవంగా నిలబెట్టారు.

> **తెలంగాణ ఉన్నంతవరకు కేసీఆర్ చరిత్ర చెరిగిపోదు. పోతుందనుకోవడం మందబుద్ధి గల మనుషుల భ్రమ. గెలుపోటములతో సంబంధం లేని మహా మనీషి కేసీఆర్. ఒకసారి ఓడిపోయినంత మాత్రాన ఆయన కీర్తికి వచ్చిన ప్రమాదమేమీ లేదు. రాజ్యాంగ రచన చేసి, బడుగు బలహీనులకు బాట చూపిన అంబేద్కర్ కూడా కుత్సితబుద్ధి గల మనుషులతో ఇమడలేక, వారు చేసిన కుట్రలు, కుతంత్రాల ఎన్నికల్లో ఓడిపోయారు. అంతమాత్రాన ఆయన కీర్తి చెరిగిపోయిందా? బడుగులతో పెనవేసుకున్న బంధం తెగిపోయిందా?**

కేసీఆర్ కట్టె లేకుండా నిలబడుడు కాదు, తెలంగాణను యావత్ ప్రపంచ చిత్రపటంలో నిటారుగా నిలబెట్టిండు. తెలంగాణను అభివృద్ధిలో అంగలు వేయించి, సంక్షేమంలో తన కెవరు సాటిలేరని నిరూపించిండు. తెలంగాణ ప్రతిష్ఠను ఎవరెస్టు శిఖరమంత ఎత్తున నిలబెట్టిండు. కానీ, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ కీర్తి, ప్రతిష్ఠలను అధః పాతాళానికి అణచివేస్తున్నడు. అందుకే, కేసీఆర్ నిలబెట్టిన తెలంగాణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పడగొట్టకుంటే చాలు. అదే తెలంగాణ ప్రజలకు మహాభాగ్యం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ నాయకులు)

ఏమో.. గుర్రం ఎగరావచ్చు!

ఐదారు నెలల కిందట యాధృచ్ఛికంగానో, మనసులో మాటో, అధిష్ఠానం కోయిల ముందే కూసిందో.. కానీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి తనతో సమానంగా సీఎం అయ్యే అర్హతలున్నాయని, ఆయన నిజమైన పోరాట యోధుడని రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ఆ మర్నాడే మరో మంత్రి ఉత్తమ్‌కు కూడా ఇలాంటి అర్థం వచ్చే వ్యాఖ్యలే చేశారు.

వనం జ్వాలా నరసింహారావు

ముఖ్యమంత్రి, మంత్రి వ్యాఖ్యల అర్థం ఏదైనా కావొచ్చు. 'రీడ్ బిట్వీన్ ద లైన్స్' విధానంలో విశ్లేషిస్తే పార్టీ-ప్రభుత్వ స్టీరింగ్ మీద చేతులు మారే అవకాశాలున్నాయేమోనన్న అభిప్రాయం కలగడం సహజం. ఐదారు నెలల కిందట జరిగిన ఈ సంగతి ఆ తర్వాత పూవు పూసి, కాయ కాసి, ఇప్పుడు దోరపండు స్థాయికి చేరుకున్నది. ఎప్పుడైనా పూర్తిగా పక్వానికి రావొచ్చు. ఇటీవలి కొన్ని పరిణామాలను, వాటి పర్యవసానాలను నిశితంగా విశ్లేషిస్తే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రథ సారథ్యం సంక్షోభంలో కూరుకుపోతున్నదా? అన్న అనుమానం సర్వత్రా వ్యక్తమవుతున్నది. నాయకుడి అదుపులోంచి పరిస్థితి శీఘ్రంగా జారిపోతున్నదనే భావన విశ్లేషకుల్లో కనిపిస్తున్నది. ఊపిరాడనివ్వకుండా అస్మదీయ, తస్మదీయ ఎమ్మెల్యేల వేరుకుంపటి సెగలు-పొగలు, పార్టీ మారివచ్చిన ఎమ్మెల్యేలలో అపోహలు, అసహనం, ఏ మంత్రి పదవికి ఎప్పుడు ఎసరు వస్తుందోనన్న ఆందోళన, కొందరు మంత్రుల మీద ఆ పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తిని బాహాటంగా ప్రకటిస్తున్న సందర్భాలు, ఆ క్రమంలో తొలి అడుగుగా కలకలం రేపిన పదిమంది శాసనసభ్యుల రహస్య భేటీ వార్త, వీటన్నిటినీ తలదన్నే, కాంగ్రెస్ పార్టీ అధికారిక ట్విటర్ (ఎక్స్) హ్యాండిల్ నిర్వహించిన సర్వేలో దాదాపు 70-80 శాతం మంది కాంగ్రెస్ పాలన వ్యతిరేకించడం వంటివి దేనికి దారితీయనున్నవో?

కాంగ్రెస్ పార్టీ మార్క్ రాజకీయాలను నిశితంగా పరిశీలిస్తే, అధినాయకత్వం మీద భయంతో కూడుకున్న అపార విశ్వాసం, గౌరవం, విచిత్రమైన క్రమశిక్షణ జగద్విదితం. కాంగ్రెస్ పాలిత ఏ రాష్ట్రంలోనైనా, తుమ్మితే ఊడే ముక్కులాగా నాయకత్వ మార్పు అలవోకగా ఏ క్షణంలోనైనా జరగవచ్చు. అధిష్ఠానాన్ని పార్లమెంటరీ బోర్డ్ అనీ, హైకమాండ్ అనీ సమయం, సందర్భాన్ని బట్టి పాజిటివ్, లేదా నెగెటివ్ అర్థం వచ్చేటట్టు ముద్దుముద్దుగా పిలుచుకుంటారు కాంగ్రెస్ పార్టీలోని చోటా, బడా నాయకులు. ఎన్టీఆర్ సీఎం కావడానికి పూర్వం రాష్ట్ర రాజకీయాలంటే కాంగ్రెస్ పార్టీ అంతర్గత, బహిర్గత, సమ్మతి, అసమ్మతి, రాజకీయాలే. నిస్వార్థంగా, గౌరవప్రదంగా, విద్వేషరహితంగా రాజకీయాలలో రాణించిన మహనీయులెందరో నడయాడిన తెలుగురాష్ట్రాలలో వర్తమాన రాజకీయాలు జుగుప్స, అసహనం, అసహ్యం, నిస్సహాయత, తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇదిలా ఉండగా, వేగంగా మారుతున్న రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాల నేపథ్యంలో నాయకత్వ మార్పు ఉండవచ్చా? లేదా? అని చూసుకుంటే, గత ఏడు దశాబ్దాల అనుభవాలను చర్విత చరణం చేసుకుంటే 'ఏమో గుర్రం ఎగరావచ్చు' సామెత గుర్తుకు వస్తుంది.

> **ముఖ్యమంత్రి కావడానికి ముందు సీఎల్పీ నాయకుడి ఎంపిక ఆసక్తికరంగా వుండేది. 1956లో సంజీవరెడ్డి ఎన్నికైనప్పుడు రాజకీయం చేయకుండా ఐక్యతకు, క్రమశిక్షణకు అధిష్ఠానం ప్రాధాన్యం ఇచ్చింది. 1957 సార్వత్రిక ఎన్నికల తరువాత కూడా, చెన్నారెడ్డి అభ్యంతరాన్ని కాదని, నీలం సంజీవరెడ్డినే సీఎల్పీ నాయకుడిగా ఎన్నుకున్నారు. 1962 ఎన్నికల అనంతరం, నీలం, దామోదరం పోటీలో నిలిచినప్పటికీ, సంజీవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి అధిష్ఠానం ఆదేశించింది. నీలం సీఎం అయ్యారు.**

1964లో సీఎం పదవికి రాజీనామా చేసిన సంజీవరెడ్డి, సీఎల్పీ నాయకుడిగా కొనసాగుతూనే, బ్రహ్మానందరెడ్డిని ముఖ్యమంత్రిగా నామినేట్ చేయించగలిగారు. 1967 సార్వత్రిక ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో గెలిచి సీఎల్పీ నాయకుడిగా బ్రహ్మానందరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1972 ఎన్నికల తర్వాత పీవీ ఏకగ్రీవంగా సీఎల్పీ నాయకుడిగా ఎన్నికై ముఖ్యమంత్రి అయ